క్లుప్తంగా

రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత



భూలక్ష్మికి చెక్కు అందిస్తున్న మేనేజర్ చంద్రరావు

మాకవరపాలెం: ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. భీమబోయినపాలెం గ్రామానికి చెందిన లాలం మణిబాబు బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంకు అకౌంట్ ఉన్నందున పీఎం జీవన జ్యోతి బీమా యోజన నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును శుక్రవారం మృతుడి భార్య భూలక్ష్మికి స్టేట్ బ్యాంకు మేనేజర్ చంద్రరావు అందజేశారు. ఏడాదికి రూ.456 చెల్లిస్తే ప్రమాద బీమాగా రూ.2 లక్షలు మంజూరు అవుతుందని చంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవానీశంకర్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్‌లు వరలక్ష్మి, వెంకటరమణ, నారాయణ మూర్తి పాల్గొన్నారు.

పాచిలవానిపాలెంలో లడ్డూ వేలం



వినాయక లడ్డూను అందుకుంటున్న పాటదారుడు రమణారావు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామంలో పీపీపీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవం గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ మేరకు మండపం వద్ద ఉంచిన 10 కిలోల లడ్డూను వేలం పాటలో గ్రామానికి చెందిన సిరపరపు రమణారావు రూ.8100కు దక్కించుకున్నారు. స్వామివారి చెంతన ఉన్న లడ్డూను పొందడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేంగిపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పాల సంఘం అధ్యక్షుడు రమణరావు, గండి సత్యం, పాచిల శ్రీనివాసరావు, పాచిల పరిశనాయుడు, రొంగలి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మండల విద్యాశాఖాధికారులు, తదితరులు

రావికమతం: మండలంలో 2025 సంవత్సరానికి డి.వి.ఎస్.లక్ష్మి(కవగుంట), బి.రమాపద్మ(కొమిర), సిహెచ్.లక్ష్మి(తోటకూరపాలెం), బి.సతీష్‌కుమార్,(జెడ్.కొత్తపట్నం), పి.నాగమణి(రావికమతం), ఎస్.రామరాజు(అంట్లంపాలెం) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఎంఈవో లింగమూర్తి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వీరప్రకాష్, కార్యదర్శి వేములపూడి రాజశేఖర్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. వారిని శాలువాతో సత్కరించారు.

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకులు

బుచ్చెయ్యపేట: కొండెంపూడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం బొలెరో వాహనాన్ని ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన కోమార చిరంజీవి, నరేంద్ర బైక్‌పై రావికమతం వెళ్లి గణనాథుడి అలంకరణ కోసం పూలదండలు తీసుకుని వస్తుండగా కొండెంపూడి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిరంజీవి తలకు తీవ్ర గాయాలు కాగా.. నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం చోడవరం ఆస్పత్రికి తరలించారు.

కిత్తంపేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



కిత్తంపేట గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం ఆవిష్కరించారు.

-రావికమతం

తెగిన రోడ్డు.. నిలిచిన రాకపోకలు

- ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న బోడిగరువు–నేరెళ్లపూడి మట్టి రోడ్డు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని స్థానిక గిరిజనుల ఆగ్రహం
- బీటీ రోడ్డు, కల్వర్టు పనులు చేపట్టడంలో అలసత్వం
- గత ప్రభుత్వం రూ.2 కోట్లతో మట్టి రోడ్డు నిర్మాణం



భారీ వర్షాలకు కోతకు గురైన బోడిగరువు-నేరెళ్లపూడి మట్టి రోడ్డు

దేవరాపల్లి: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాల పాలిట శాపంగా మారింది. సమ్మెద నుంచి బోడిగరువు, నేరెళ్లపూడి వెళ్లే మట్టి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం కాలిబాట సైతం లేని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సుమారు రూ. 2 కోట్లతో నూతనంగా మట్టి రోడ్డును నిర్మించారు. ఈ మార్గంలో బీటీ రోడ్డు నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో బీటీ రోడ్డుతో పాటు కొన్ని చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి చెందిన నేతలు ఈ రోడ్డు నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారు. బీటీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం పేరిట స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు అనధికారికంగా ఈ ఏడాది మార్చి 11న శంకుస్థాపన చేసి హడావిడి చేశారు. పనులు చేపట్టడంలో మాత్రం చిత్తశుద్ధి కనబరచలేదు. దీంతో మట్టి రోడ్డు కోతకు గురై ఈ రెండు గ్రామాల గిరిజనుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా రోడ్డు పనులు పూర్తి చేయలేదని, ఇది ముమ్మాటిక ప్రభుత్వ నిర్లక్ష్యమేనని స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మించి కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసి ఉంటే తమకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారు స్పందించి కోతకు గురైన రోడ్డును తాత్కాలికంగా మట్టితో పూడ్చి తిరిగి రాకపోకలను పునరుద్ధరించాలని స్థానిక గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే శారదానది దాటి రాకపోకలు సాగించడం తప్పా తమకు ప్రత్యామ్నాయం లేదని వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సాయి ప్రసాద్

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ యువజన విభాగాన్ని మరింత పటిష్టపరిచి పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఇటీవల మాడుగుల నియోజకవర్గ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా నియమితులైన ఆకుల సాయి ప్రసాద్‌కు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. బూడి ముత్యాలనాయుడును శుక్రవారం సాయి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. బూడిని శాలువాతో సత్కరించి తన నియామకానికి సహకరించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో యువజన విభాగంను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించాలని బూడి కోరారు. పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌ను సాయిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వంటాకు గోవిందరావు, త్రిశూలం ఈశ్వరరావు, కొత్తూరు శ్రీనివాసరావు, అదీప్, నాయుడు, మాణిక్యం, తాడి సతీష్ పాల్గొన్నారు.

ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం చోడవరం నుంచి అప్పలరాజుపురం మెట్ట సమీపంలోకి వచ్చేసరికి కె.జె.పురం గ్రామానికి చెందిన షేక్ బాబ్జి తన ఆటోను మరమ్మతులు చేయించేందుకు తీసుకెళ్తుండగా మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు అయింది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆటో, బస్సు డ్రైవర్లు తెలిపారు.

వాడవాడలా అన్నసమారాధనలు



తారువ అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కె.జె.పురం శాలిపేట వద్ద జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం పలు చోట్ల అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కె.జె.పురం శాలిపేటలో బాల వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు గ్రామస్తులతో పాటు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. హౌసింగ్ కాలనీలో ఎంపీపీ పాఠశాల వద్ద బీఆర్ అంబేడ్కర్ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి భక్తులకు అల్పాహారం అందజేశారు.

కె.కోటపాడు : చౌడువాడలో పాత హాస్టల్ వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా గణనాథుడికి పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో వినాయక గుడి వద్ద కమిటీ సభ్యులు వినాయక చవితి సంబరాల్లో భాగంగా పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్తులతో పాటు కొంకసింగి, నాగాపురం, పాత కృష్ణదేవిపేట గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు.

దేవరాపల్లి: తారువలో నిర్వహించిన అన్నసమారాధనలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జోన్-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ పాల్గొని భక్తులకు వడ్డించారు. ముందుగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవరాపల్లి శివారు కొరుపోలు వారి కల్లాల్లో జరిగిన అన్నసమారాధనలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, గండిపడాల అప్పలరాజు, కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు, వరదపురెడ్డి అప్పలనాయుడు, కొరుపోలు శ్రీను, గంగంవంశం సంతోష్ పాల్గొన్నారు.



తారువలో వినాయకుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఈర్లె అనురాధ

బ్రిటిష్ సమాధుల స్థలంలో కట్టడాలను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

నర్సీపట్నం: నర్సీపట్నంలోని సర్వే నంబరు 9లో బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో లాంటి ఉన్నతాధికారులున్న ప్రాంతంలోనే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారికి అనుకూలంగా మాట్లాడటం దారుణమన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిగా ఉన్న ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగుతూ ఉంటే చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న దుకాణం పెట్టుకుంటే తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు ఒకేచోట ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతంలో షాపింగ్ మాల్ కడుతూ ఉంటే ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులు అమలు చేసి అక్రమ కట్టడాలను తొలగించకపోతే బాధ్యులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అడిగర్ల రాజు, పి.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గురుదేవోభవ..!

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- గురువులకు ఘన సన్మానం



నాతవరం: ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన



నాతవరం: ఉపాధ్యాయిదేవి సత్కరిస్తున్న ఎఈవోలు, తదితరులు



ఒమ్మలి అంగన్‌వాడీ కేంద్రంలో దేశ నాయకులు, ఉపాధ్యాయుల వేషధారణలో చిన్నారులు



కాశీపురంలో హైస్కూల్‌లో హెచ్ఎం సుజాతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



నర్సీపట్నం: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



ఎం.కోటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాను సన్మానిస్తున్న తల్లిదండ్రులు



నర్సీపట్నం: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

నర్సీపట్నం: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో క్లబ్ రీజనల్ చైర్మన్ సిహెచ్.ఇందిరా, అధ్యక్ష, కార్యదర్శులు కర్రి రాంగోపాల్, బేతిరెడ్డి విజయకుమార్.. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీడీలు సిహెచ్.వి.ప్రసాద్, ఎ.బుల్లబ్బాయి, నాగేశ్వరరావు, కె.రమేష్, అచ్చియ్యమ్మ, లోవ నారాయణమ్మను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. క్లబ్ సభ్యులు వెలగా నారాయణరావు నలంద స్కూల్‌లో చదువుతున్న ప్రతిభావంతుడైన విద్యార్థికి రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సుదీర్, ప్రోగ్రాం ఆఫీసర్ గొలుసు శ్రీనివాస్, క్లబ్ సభ్యులు వికాస్ సతీష్, కుప్పిలి శ్రీనివాస్, కుప్పిలి మురళీ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి నియోజకవర్గ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు చెందిన అధ్యక్షులు స్వామి, శ్రీనివాస్, నాగేంద్ర, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు

మాకవరపాలెం: క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తామరం ఇంజినీరింగ్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్లతోపాటు అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శ్రీకుమార్, అనకాపల్లి, నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్లు శ్రీనివాసరావు, రాజు, అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ఏవో డానియల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగుల: బాల్యంలో చదువుకున్న పాఠశాలలోనే హెచ్‌ఎంగా పని చేసిన సిరిపల్లి నాగ వెంకటదేవి సూర్యనారాయణను మాడుగుల మానస మహాలక్ష్మి మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు బ్యాంకు సీఈవో వి.పరమేశ్వరావు సన్మానించారు. మాడుగుల గెడ్డబడిలో ఆయన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమములో ఆఫీసు ఇన్‌చార్జి యలగాడ వెంకటేశ్, సిబ్బంది పద్మ, మౌనిక, దేవి, నాగమణి, విజయ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఎం.కోటపాడు –2 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.పార్వతి, సహాయకురాలు పి.సత్యవతిని సన్మానించారు. ఐసీడీఎస్ సీడీపీవో యర్రయ్యమ్మ, సెక్టారు సూపర్‌వైజరు ఎలూసూరి ఈశ్వరమ్మ, గ్రామ ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్, సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. ఒమ్మలి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నార్లను దేశ నాయకులు, సైనికులు, ఉపాధ్యాయుల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు.

కె.కోటపాడు : మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. చౌడువాడ పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి దాట్ల అప్పలరాజు, ప్రధానోపాధ్యాయుడు దీవి అప్పలకొండ పూలమాల వేసి అంజలి ఘటించారు. కె.కోటపాడులోని అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సర్వేపల్లి విగ్రహానికి విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.కె.ఖాసిమ్, రిటైర్డ్ ఎంఈవో దాట్ల చంద్రశేఖర్‌వర్మ పూలమాల వేసి నివాళులర్పించారు.

దేవరాపల్లి: స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి మండలంలోని ఉపాధ్యాయులు అవుగడ్డ కృష్ణ స్వామినాయుడు, చప్ప లక్ష్మణరావు, ఐ.రాము, డి.సందీప్, సిహెచ్.దేముడు, ఆదిరెడ్డి కృష్ణ, యు.వరలక్ష్మీ, సిబ్బంది మురికితి శ్రీను, ఉపేంద్ర తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాశీపురం హైస్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక హెచ్ఎం ఆర్.సుజాతను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కొట్టాన రాంబాబు మాస్టారు దర్శకత్వం వహించిన 'సోది'లఘునాటిక, వృక్ష మిత్ర ఏకపాత్రాభినాయం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నాతవరం: మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. హైస్కూల్ విద్యార్థినులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బ్రహ్మాజీ, కామిరెడ్డి వరహాలబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అపిరెడ్డి మాణిక్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పైల పోతురాజు, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు పైల వరహాలబాబు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావును సత్కరిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

నర్సీపట్నం: శ్రీవిద్య కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి కళాశాల కరస్పాండెంట్ జి.సత్యవేణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు జి.శేషగిరిరావు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరస్పాండెంట్ దంపతులను, అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



చౌడువాడలో సర్వేపల్లి చిత్రపటం వద్ద చిన్నారులతో కలిసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అందుబాటులోకి యూరియా

సాక్షి ఎఫెక్ట్..

మాడుగుల రూరల్: మండలంలో రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకొచ్చామని మండల ప్రత్యేకాధికారి కె.శివప్రసాదు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా లేక ఇబ్బందులు శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో కె.జె.పురం, జె.డి.పేట, సత్యవరం, మాడుగుల రైతు సేవా కేంద్రాలకు 10 టన్నుల చొప్పున యూరియాను పంపించామన్నారు. ఇప్పటికే 20 టన్నుల వరకు విక్రయించామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. తహసీల్దారు కె.రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, మండల వ్యవసాయాధికారి ఎం.అనసూయ, ఎస్ఐ జి.నారాయణరావుతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఎరువులు విక్రయాలపై నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. కె.జె.పురం రైతు సేవా కేంద్రానికి శుక్రవారం పది టన్నులు యూరియా రాగా..మండల వ్యవసాయాధికారి ఎం.అనసూయ, స్థానిక వీఏఏ చంద్రిక, పోలీసు సిబ్బంది కలిసి తెలకలదీపం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో అన్ లోడింగ్ చేశారు. శనివారం ఉదయం నుంచి రైతులకు యూరియా విక్రయిస్తామని ఏవో తెలిపారు.



కె.జె.పురం రైతు సేవా కేంద్రం వద్ద లారీ నుంచి యూరియాను దించుతున్న దృశ్యం

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



బుచ్చెయ్యపేటలో ఎన్నికైన ఏపీటీఎఫ్ నాయకులు

బుచ్చెయ్యపేట: ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బి.శేషుకుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం విజయరామరాజుపేటలో సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా మండల కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిహెచ్.మధుకృష్ణ, ఉపాధ్యక్షులుగా గల్లా గణేష్, డి.నారాయణరావు, కె.రాజు, ఆర్.ప్రసాదరావు, కార్యదర్శులుగా సిహెచ్.ప్రసాద్, పల్లా గణేష్, ఎం.లక్ష్మి, జిల్లా కౌన్సిలర్‌గా అంజి, రమణరావు, బి.కృష్ణవేణి, పి.లీలావతి ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు తెలిపారు.